ప్రజాజ్యోతి
నిజామాబాద్
కామారెడ్డి
మంగళవారం । 1 । జూలై । 2025 పేజీలు 5

బోధన్ జూన్ 30.(ప్రజాజ్యోతి)

హరే రామ.. హరే కృష్ణ.. కృష్ణ కృష్ణ హరే హరే అనే నామస్మరణతో బోధన్ పట్టణం మార్మోగింది. ఇస్కాన్ ఆధ్వర్యంలో సోమవారం జగన్నాథ రథయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆచన్ పల్లిలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఈ రథయాత్రను ప్రారంభించారు. ఆద్యంతం భక్తులతో ప్రధాన కూడళ్లు కిక్కిరిసిపోయాయి. జగన్నాథుని రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఆచన్ పల్లి నుండి ప్రారంభమైన రథయాత్ర భక్తుల కోలాహలం నడుమ శక్కర్ నగర్ చౌరస్తా నుండి కొత్త బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా మీదుగా రాకాసిపేట్ లోని టిటిడి కళ్యాణ మండపం వరకు చేరుకుంది. అనంతరం రథయాత్రలో పాల్గొన్న భక్తుల సౌకర్యార్థం ఇస్కాన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.రథయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎసిపి శ్రీనివాస్ గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగా శంకర్, శరత్ రెడ్డి, పులి శ్రీనివాస్, బిల్లా రామ్మోహన్, బొబ్బిలి శ్రీనివాస్, మహిళలు,యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# కదిలిన జగన్నాథుడి రథచక్రాలు







## ఇందిరమ్మ ఇళ్లకు డబ్బులడిగితే

# పార్టీ నుంచి బహిష్కరిస్తాం: షబ్బీర్ అలీ

(నిజామాబాద్ ప్రతినిధి)

ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు లబ్ధిదారుల వద్ద నుంచి కాంగ్రెస్ నాయకులు లేదా కమిటీ సభ్యులు ఎవరైనా డబ్బులు అడిగితే, వారిని కాంగ్రెస్ పార్టీ నుంచి తక్షణమే బహిష్కరిస్తామని తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ గట్టి హెచ్చరిక చేశారు. సోమవారం ఆటోనగర్‌లో ఏర్పాటు చేసిన సభలో డివిజన్ 28, 29, 30లకు చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రాసెసింగ్ కాపీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, “ఇందిరమ్మ ఇండ్లు పేదల హక్కు. వీటిపై ఎవరూ చేతులు వేయరాదు. కాంట్రాక్టర్‌లా వ్యవహరిస్తూ డబ్బులు అడిగితే, అటువంటి వారిని పార్టీ లో ఉంచం. ఇలాంటి విషయాల్లో ఏ సందేహం లేకుండా కఠిన చర్యలు తీసుకుంటాం,” అని స్పష్టంచేశారు.

అదేవిధంగా, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడం ద్వారా పేదల ముఖాల్లో సంతోషం చూడటం తనకు గర్వకారణమని చెప్పారు. కాంగ్రెస్ పాలనలోనే నిజమైన సంక్షేమం కొనసాగుతోందని, ఇందిరమ్మ ఇండ్లతో పాటు ఉచిత సన్న బియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ వంటి పథకాలు



ప్రజల జీవితం లో భారం తగ్గిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూడా చైర్మన్ కేశ వేణు, నాయకులు రత్నాకర్, జావేద్ అక్రమ్, సమీ, హారూన్, పాప ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



## నూతన గ్రామ అభివృద్ధి కమిటీ ఎన్నిక

**నిజామాబాదు ప్రజాజ్యోతి న్యూస్** ఆర్మూర్ మండలం కోటార్మూర్ గ్రామాభివృద్ధి కమిటీ 2025- 26 సంవత్సర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. వీడీసీ నూతన అధ్యక్షుడిగా మెరుగు మహేందర్ గౌడ్, ఉపాధ్య క్షుడిగా బరుకుంట చిన్న రాజన్న, కోశాధికారిగా తొగర్ల రవి, ప్రధాన కార్యదర్శిగా మామిడి లూకా, జాయింట్ సెక్రటరీగా చౌడ కిషన్, అడ్వైజర్ గా దొంగమంటి శ్రీకాంత్, సభ్యులుగా కె.గంగారాం, గోరింటాల నరేష్ గౌడ్, డీసీ రాములు, కనక గంగ మోహన్, చాకలి రాములు, శాల ప్రసాద్, మునిపల్లి నర్సయ్య ఎన్నుకోవడం జరిగింది. అనంతరం వీడిసి నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ మా మీద నమ్మకంతో మా అందరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామంలోని అన్ని కుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## డ్రాపౌట్‌లు ఎక్కువగా ఉన్న బడులపై ప్రత్యేక దృష్టి సారించాలి

### కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్ జూన్ 30 : డ్రాపౌట్ లు ఎక్కువగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి విద్యా శాఖ అధికారులకు సూచించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో అన్ని సర్కారు బడులలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగేలా చొరవ చూపాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ సోమవారం మండల విద్యా శాఖ అధికారులతో సమీక్ష జరిపారు. జూన్ 06 నుండి 12 వరకు నిర్వహించిన బడిబాట సందర్భంగా నూతనంగా నమోదైన ప్రవేశాల గురించి ఒక్కో మండలం వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారం రోజుల పాటు విద్యార్థులు ప్రవేశాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ప్రభుత్వ బడులలో మెరుగుపడిన మౌలిక సదుపాయాలు, ఉత్తీర్ణత, భర్తీ అయిన టీచర్ల ఖాళీలు, నాణ్యమైన విద్యా బోధన, ఉచితంగా యూనిఫామ్ లు, టెక్స్ట్ బుక్కులు, నోట్ బుక్కులు సమకూరుస్తున్న విషయాల గురించి ఇంటింటికి వెళ్లి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వివరిస్తూ పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించేలా కృషి చేయాలన్నారు. కాగా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం చేపట్టిన మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయించాలని, ఈ పనులకు నిధులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.



అవసరమైన బడులలో కిచెన్ షెడ్ లు వంటి వాటి నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి కళాశాలల్లో చేరేలా పర్యవేక్షణ జరపాలని అన్నారు. పదవ తరగతి పూర్తి చేసుకుని పై చదువులలో చేరని వారిని గుర్తిస్తూ, ఒక్కో విద్యార్థి వారీగా పూర్తి వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో పంపిణీ జరిగాయని, నోట్ బుక్కులు కూడా 80 శాతం వరకు పంపిణీ అయ్యాయని మిగతా వాటిని కూడా జిల్లాకు కేటాయించిన వెంటనే విద్యార్థులకు ఆయా పాఠశాలల వారీగా అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఒక జత ఏకరూప దుస్తులు ఇప్పటికే విద్యార్థిని విద్యార్థులకు అందించామని, రెండవ జత యూనిఫామ్ లను మహిళా స్వయం సహాయక సంఘాలు త్వరగా కుట్టించి ఇచ్చేలా కృషి చేయాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఈఓ అశోక్, ఎంఈఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి : కలెక్టర్

**నిజామాబాద్ కలెక్టరేట్ ప్రజా జ్యోతి జూన్ 30:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ వెంటదివెంట పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 127 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్డీఓ సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, మెప్మా పీ.డీ.రాజేందర్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ప్రజావాణికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు హాజరు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎస్సెస్సీ టాపర్లకు సన్మానం

**నిజామాబాద్, కలెక్టరేట్ జూన్ 30** పదవ తరగతి 2024 – 2025 వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించి టాపర్లుగా నిలిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులను జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఘనంగా సన్మానించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ నాణ్యమైన విద్యను బోధిస్తే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయని అన్నారు. ఇదివరకటితో పోలిస్తే ప్రభుత్వ బడులలో ఉత్తీర్ణత ఎంతో మెరుగుపడిందని, ఇదే స్ఫూర్తితో వచ్చే విద్యా సంవత్సరం మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని హితవు పలికారు. ప్రత్యేకించి ప్రభుత్వ బడుల నిర్వహణ మెరుగయ్యేలా మహిళా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని, తమ సొంత ఇంటిని తీర్చిదిద్దుకునే విధంగానే సర్కారీ బడులలో ప్రమాణాలు మెరుగుపడేలా చొరవ చూపాలన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో సదుపాయాల మెరుగుదల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను వెచ్చిస్తోందని, దీనిని దృష్టిలో పెట్టుకుని అన్ని బడులలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగేలా చూడాలన్నారు. చక్కగా పనిచేసే వారిని తప్పనిసరిగా ప్రోత్సహిస్తామని, ప్రతి ఒక్కరు తమ విధులకు పూర్తి న్యాయం చేస్తూ, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ, విద్యా, క్రీడ, పర్యాటక రంగాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగా ప్రతి పాఠశాలలో సౌకర్యాలు, విద్యా బోధన మెరుగుపడేలా కృషి చేయాలని విద్యా శాఖ అధికారులకు సూచించారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు సైతం ప్రభుత్వ బడులను ఆదర్శంగా తీసుకునేలా తీర్చిదిద్దాలని అన్నారు. ఉజ్వల భవిష్యత్తు కలిగిన



విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు వంటి వాటి బారిన పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ విషయంలో సీఎం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నారని అన్నారు. చాలాకాలం నుండి పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ఇటీవలే ప్రభుత్వం పూర్తి చేసిందని గుర్తు చేశారు. ఎస్సెస్సీలో 586 మార్కులు సాధించిన డొంకేశ్వర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తోట రక్షితను అభినందిస్తూ ముఖ్య అతిథులు సత్కరించారు. అలాగే, 584 మార్కులు సాధించిన ఓరగంటి గంగాగోపాల్, గట్టు షైనీ, 582 మార్కులు పొందిన ఎస్.దీప్తి, డి.వైశాలి, 579 మార్కులు సాధించిన వై.కీర్తన, 577 మార్కులు సాధించిన అలేఖ్య, వై.గ్రీష్మ, జంగిటి అక్షరలను ఎమ్మెల్యేలు, కలెక్టర్ ఘనంగా సన్మానించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పల్లికొండ, డొంకేశ్వర్, రాంపూర్, మెండోరా, అమ్రాద్, చౌట్పల్లి, జక్రాన్పల్లి, మోస్రా, కల్లెడి, రెంజల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కూడా సత్కరించారు. ప్రభుత్వ బడులలో అత్యధికంగా విద్యార్థులను చేర్పించిన బోర్గం(పి) హైస్కూల్, బోధన్ రాకాసిపేట్ బాలికల ఉన్నత పాఠశాల, చిట్టాపూర్ ప్రైమరీ స్కూల్, తుంపల్లి ప్రైమరీ స్కూల్, ఫులాంగ్ బాలుర ఉచ్చతర ప్రాథమిక పాఠశాలల హెచ్.ఎంలను కూడా సత్కరించారు. సోమవారం నాటితో పదవీ విరమణ చేసిన ముగ్గురు ఎంఈఓలు, ముగ్గురు హెచ్.ఎం లను ఘనంగా సన్మానించి వీడ్కోలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, అదనపు కలెక్టర్ అంకిత్, జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్, ఎం.ఈ.ఓలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గజిటెడ్ హెచ్.ఎంలు, కాంప్లెక్ హెచ్.ఎంలు, ఎంఆర్పీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొనరు

### మెరుగైన ఫలితాల కోసం ఇప్పటి నుంచే సాధన

**కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ఇదివరకటి రెండు సంవత్సరాలలో పోలిస్తే, ఈసారి పదవ తరగతిలో జిల్లాలో సగటు ఉత్తీర్ణత మెరుగుపడిందని అన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాల సాధన కోసం ఇప్పటినుండే నాణ్యమైన విద్యా బోధనపై దృష్టిని కేంద్రీకరించాలని విద్యా శాఖ అధికారులకు సూచించారు. గణితం, ఆంగ్లం, సామాన్య శాస్త్రం వంటి సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్లు, జిల్లా అధికారులకు క్రమం తప్పకుండా ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ, నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా వసతుల కొరత ఉంటే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఎస్సెస్సీలో మెరుగైన ఫలితాల సాధన, అందుబాటులోకి వచ్చిన సౌకర్యాలు, నాణ్యమైన విద్యా బోధన గురించి విస్తృతంగా ప్రచారం చేస్తూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చూడాలన్నారు.**

## పాఠశాల తనిఖీ



**మోపాల్ ప్రజాజ్యోతి జూన్ 30:** మోపాల్ మండలం కంజర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలో చేపట్టిన పనుల గురించి ప్రధానోపాధ్యాయుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రూ. 11.20 లక్షల నిధులు మంజూరు కాగా, తాగునీటి వసతి, విద్యుత్, ఫ్లోరింగ్ తదితర ప్రతిపాదిత పనులన్నీ పూర్తి అయ్యాయని హెచ్.ఎం గోపాలచారి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఇంకా ఏమైనా వసతులు అవసరమైతే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఈఓ అశోక్, ఎంపీడీఓ రాములు తదితరులు ఉన్నారు.




## ఉద్యోగులకు ఘన సన్మానం

**(నిజామాబాద్ ప్రతినిధి)** నిజామాబాద్ %=ుజ% డిపోలో సుదీర్ఘకాలం సేవలందించిన ముగ్గురు ఉద్యోగులు ు మొహమ్మద్ నసీరుద్దీన్, ఎన్. లక్ష్మణ్ గౌడ్, టీ. నాగేశ్వర్‌లు సోమవారం ఘనంగా పదవీ విరమణ పొందారు. విధులకు ఎల్లప్పుడు నిష్ట, నిజాయితీతో భాద్యతల్ని నిర్వర్తించినందుకు వీరిని డిపో మేనేజర్ ఎస్. ఆనంద్ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా డిపో ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో సహచరులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వీరికి పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సత్కరించారు. "%=ుజ%కు మీరు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయి. రిటైరైన తర్వాత మీరు ఆరోగ్యంగా, సంతోషంగా జీవించండి" అని అందరూ హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు.



## కృత్రిమ కొరత సృష్టించవద్దు

ఏర్గట్ల జూన్ 30 : (ప్రజాజ్యోతి) మండల కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి వైష్ణవ్ కుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఈ వానకాలం సంబంధించి తేదీ 30.06.2025 నాటికి 425 .25 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగింది. ఈ ఒక్క రోజు సోమవారం 1350 బస్తాల యూరియా రావడం జరిగింది. రైతుసోదరులు ఎటువంటి అపోహలకు గురికావద్దు, మనకి కావాల్సిన యూరియా మరియు కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయ్ కావున రైతులు అవసరానికి తగినంతనే తీసుకెళ్లాలి, పంటకాలం మొత్తానికి ఒకేసారి తీసుకువెళ్లి కృత్రిమ కొరత సృష్టించవద్దు, అలా చేస్తే తోటి రైతులకి సమయానికి యూరియా అందుబాటులో ఉండదు. కనుక రైతులు అవసరానికి అనుగుణంగా వాడుకోవాలి. మండలనికి సరిపడా ఎరువుల సరఫరా జరుగుతుంది. కావున రైతులు ఎట్టి పరిస్థుతుల్లో ఆందళోనకు గురికావద్దు, వదంతులను నమ్మొద్దు. వ్యవసాయానికి సంబంధించిన యూరియా, పిచికారి మందులు సహకార సొసైటీలో అందుబాటులో ఉన్నాయి. రైతులు అవసరం ఉన్నవారు తీసుకు వెళ్లగలరు అని తెలిపారు.

### లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా

# ప్రకాష్ నాయక్



**కామారెడ్డి రూరల్ ప్రజా జ్యోతి జూన్ 30** లంబాడ హక్కుల పోరాట సమితి కామారెడ్డి జిల్లా విద్యార్థి సంఘం అధ్యక్షులుగా మాలవత్ ప్రకాష్ నాయక్ ను లంబడా హక్కుల పోరాట సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షులు నూనావత్ గణేష్ నాయక్ చేతుల మీదుగా నియామక పత్రం అందజేయడం జరిగింది

ఈ సందర్భంగా లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు సునావత్ గణేష్ నాయక్ మాట్లాడుతూ లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాణా ప్రతాప్ రాథోడ్ ఆదేశాల మేరకు కామారెడ్డి జిల్లా విద్యార్థి సంఘం అధ్యక్షుడి గా మాలావత్ ప్రకాష్ను నియమించడం జరిగిందని తెలిపారు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని అట్టి విషయం పైన విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడాలని ఉద్దేశంతోటే ప్రకాష్ నాయక్ను కామారెడ్డి జిల్లా విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా నియమించడం జరిగిందని తెలిపారు అనంతరం కామారెడ్డి జిల్లా విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా నియమితులైన మాలవత్ ప్రకాష్ నాయక్ మాట్లాడుతూ నా మీద నమ్మ కంతో నాకు కామారెడ్డి జిల్లా విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా నియమించినందుకు కామారెడ్డి జిల్లా అధ్య క్షులు నూనావత్ గణేష్ నాయక్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు ఏదైతే నాకు నమ్మ కంతో నన్ను నియమించారో దానిని తూచా తప్పు కుండా పాటిస్తానని తెలిపారు నాపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు గణేష్ నాయక్కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలుపుతున్నాను అన్నారు



## భీమ్ గల్ ఎస్సై గా సందీప్

**భీమ్ గల్ జూన్ 30 ప్రజాజ్యోతి** భీమ్ గల్ పోలీస్ స్టేషన్ లో ఎస్సై గా విధులు నిర్వహిస్తున్న జీ. మహేష్ బదిలీ పై వెళ్లగా ఆయన స్థానం లో సోమవారం సందీప్ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన భీమ్ గల్ సీఐ సత్యనారాయణ ను మర్యాద పూర్వకంగా కలిసారు



## వితనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి

### సర్వసమాజ్ కమిటీ భీమ్ గల్

**భీమ్‌గల్ ,జూన్ 30 ప్రజాజ్యోతి** ఖరీఫ్ ప్రారంభం అయిన నేపథ్యంలో రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని సర్వసమాజ్ అధ్యక్షులు నీలం రవి కోరారు. సోమవారం ఈ మేరకు స్థానిక వ్యవసాయ అధికారులు, సహకార సంఘం అధ్యక్షులకు వేర్వేరుగా కలిసి వినతి పత్రం అందజేశారు. దేశానికి అన్నం పెట్టె రైతన్న లకు ఇబ్బంది లేకుండా చూసే బాధ్యత అధికారులు, నాయకులపై ఉందన్నారు. ఖరీఫ్ లో రైతులు ఎంత సాగు చేస్తున్నారు, వారికి కావలసిన ఎరువులు, విత్తనాలు ఎంత అవసరం అనేది వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటికే అంచనా వేయడం జరిగిందని, అంచనా మేరకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. యూరియా కొరకు రైతులు తిరిగి ఇబ్బందులు ఎదుర్కోకుండా, యూరియా బ్లాక్ కాకుండా చూడాలని అన్నారు. రైతులకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయించే వ్యాపారులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఎప్పటికప్పుడు దుకాణాలను తనిఖీ చేయాలని తెలిపారు. రైతులకు నకిలీ విత్తనాలు, పురుగు మందులు అంతగట్టే వ్యాపారులపై నిఘా ఉంచి వ్యవసాయ చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులు కొనుగోలు చేస్తున్న ఎరువులు, విత్తనాలు, పురుగు మందులకు బిల్లులు ఇచేలా చర్యలు తీసుకోవాలన్నారు. దుకాణాల్లో స్టాక్ వివరాలు, ధరల పట్టికలు ఏర్పాటు చేయించాలని అధికారులను కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సర్వసమాజ్ ఉపాధ్యక్షులు బర్ల మోహన్, బైండ్ల మహేష్ తదితరులు ఉన్నారు.

## సన్మానం



**నిజామాబాదు ఆర్ సి, జూన్ 30 (ప్రజాజ్యోతి)** నిజామాబాద్ జిల్లా జిల్లా యువజన మరియు క్రీడా అధికారి జక్కుల ముత్తేన్న ని టి జి పేట అధ్యక్షులు గోపిరెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించినారు.సమర్థవంతమైన విధి నిర్వహణతో జిల్లా యువజన క్రీడల అధికారి (డివైఎస్ఓ) స్థాయికి ఎదిగారు అన్ని కొనియాడారు. విధి నిర్వహణలో ఎటువంటి మచ్చ లేకుండా 34 ఏళ్లపాటు కర్తవ్యాన్ని నిర్వర్తించిన ముత్తెన్న ఈ రోజు పదవీ విరమణ పొందినారు. సీఎం కప్ లాంటి టోర్నమెంట్ లు విజయవంతంగా నిర్వహించి వేలాది మందికి ఉపయోగకరమైన సేవలు అందించారు. అంతర్నిహిత నిజాయితీ, పారదర్శకతతో ఆయన అందరి మన్ననలూ పొందారు. జిల్లా క్రీడాభివృద్ధికి ఎంతగానో తోడుపడ్డారు. ఈ కార్యక్రమంలో టిజిపేట వైస్ ప్రెసిడెంట్ పావని, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్, సాయిలు, జిల్లా టైక్వాండో అధ్యక్షులు అజ్మత్ ఖాన్ పాల్గొన్నారు



## ఉపాధ్యాయునికి ఉద్యోగ విరమణ మహోత్సవం

బాల్కొండ జూన్ 30 ప్రజాజ్యోతి (రూరల్) : బాల్కొండ మండలంలోని చిట్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ హిందీ బోధించే ఉపాధ్యాయులు గోవర్ధన సుదర్శన్ ఉద్యోగ విరమణ మహోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమ ముఖ్య అతిథులుగా బట్టు రాజేశ్వర్ ఎంఈఓ హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదర్శనా చారి విద్యార్థులకు చక్కని బోధన క్రమశిక్షణ విలువలు ఆవిష్కరించే విధంగా కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సభాధ్యక్షులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, వేల్పూర్ ఎంఈఓ బెజ్జోర శ్రీనివాస్, కమ్మర్పల్లి ఎంఈఓ ఆంధ్రయ్య,వారి సేవలను కొనియాడారు.సన్మాన గ్రహీత బంధు, మిత్రులు వివిధ పాఠశాలలలో వారితో పనిచేసిన ఉపాధ్యాయ బృందం, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు గణేశ్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ గౌడ్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, గ్రామాభివృద్ధి కమిటీ, పూర్వ విద్యార్థులు, స్థానిక ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయ బృందం వారితో పని చేసిన మధుర స్మృతులు గుర్తుచేసుకున్నారు. ఘనంగా సన్మానించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్,ఉపాధ్యాయులు నర్సారెడ్డి, భృగు మహర్షి, రామారెడ్డి,శ్రీనివాస్,పద్మ, రాజేందర్ గౌడ్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# కుల సంఘాల నూతన భవనాల ప్రారంభోత్సవం



**రాజంపేట జూన్ 30 (ప్రజాజ్యోతి)** రాజంపేట మండలంలోని పలు గ్రామాల్లో సామాజిక వర్గాల కోసం నిర్మించిన నూతన కుల సంఘ భవనాలకు కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి సోమవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాజంపేట మండల కేంద్రంతోపాటు పెద్దపల్లి, శివాయిపల్లి, పొందుర్తి, తలమడ్ల, ఆరేపల్లి, ఆరేపల్లి తండా గ్రామాల్లోని పద్మశాలి, ముదిరాజ్, రజక, యాదవ, కురుమ, నాయక్, రెడ్డి తదితర కుల సంఘాల కోసం భవనాలు నిర్మాణం చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ పనులు సొంత నిధులతో చేపట్టినట్టు పేర్కొన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి తన ప్రధాన లక్ష్యమని, గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. శాలువాలు, పూలమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సంపత్ రెడ్డి, రాజంపేట పట్టణ బీజేపీ అధ్యక్షులు గుర్రాల రాము, బీజేపీ సీనియర్ నాయకులు, గ్రామస్తులు, కుల సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఐలమ్మ విగ్రహావిష్కరణ



**రాజంపేట జూన్ 30 (ప్రజా జ్యోతి)** రాజంపేట మండలంలోని ఆరేపల్లి గ్రామంలో రైతు, శ్రామికుల హక్కుల కోసం జీవితాన్ని అర్పించిన ఐలమ్మ త్యాగాలకు గుర్తుగా ఆమె విగ్రహాన్ని ఆవిష్కరించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కామారెడ్డి బీజేపీ శాసనసభ్యులు కాటిపల్లి వెంకటరమణా రెడ్డి హాజరై ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “ఐలమ్మ గారు నిర్భయంగా వ్యవసాయ కార్మికుల, పేదల పక్షాన పోరాడిన ప్రేరణాత్మక నాయకురాలు. సమాజానికి మార్గదర్శకురాలు. ఈ త్యాగాల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి, అని అన్నారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు చాకలి పెద్ద నర్సింలు, కోశాధికారి వెంకం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి చాకలి సంతోష్ కుమార్, సభ్యులు వెంకం వెంకటి, వెంకం రాములు, చాకలి నరసయ్య, ఇతర రజక సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో ఏర్పాటు చేసిన విందులో పాల్గొని రజక సంఘం సభ్యులతో సానుకూలంగా ముచ్చటించారు. కార్యక్రమాన్ని గ్రామస్తులు విజయవంతం చేశారు.



## హత్యయత్నం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష

**కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి జూన్ 30.** మాచారెడ్డి మండలంలోని నెమ్మిలిగుట్ట తండాకు చెందిన జెరుపుల నవీన్ (వయస్సు: 24) తన వదిన జెరుపుల సంకి, వేరే వారితో సన్నిహితంగా ఉంటుందని, అనుమానంతో 2017 ఫిబ్రవరి 24న మాంసం కోసే కత్తితో ఆమెను పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ మేరకు మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నం: 34/2017, సెక్షన్ 307 ఐపిసి కింద నమోదు చేసి, నిష్ణాతంగా దర్యాప్తు నిర్వహించి నిందితుడిని కోర్టుకు హాజరు పరిచారు. ఈ కేసులో 2023లో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, కామారెడ్డి నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష మరియు 100 రూపాయలు జరిమానా విధించింది. అనంతరం నిందితుడు జిల్లా కోర్టులో అప్పీల్‌కు వెళ్లగా, సోమవారం రోజున జిల్లా న్యాయమూర్తి సిహెచ్. వర ప్రసాద్ విచారణ అనంతరం నిందితుడికి సీనియర్ సివిల్ జడ్జి 2023 శిక్ష మూడేళ్ల జైలు శిక్షతో పాటు 100 రూపాయలు జరిమానా సరైనదే అంటూ తీర్పునిచ్చారు. సరియగు పద్ధతిలో కేసు విచారణ చేసి పకడ్బందీ ఆధారాలతో నిందితునిపై కోర్టు యందు అభియోగ పత్రం వేయడం జరిగింది. కావున ఇట్టి కేసులో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, కామారెడ్డి ఇచ్చిన తీరుపై అప్పీల్‌కు వెళ్ళినప్పటికీ, శిక్ష సరైనదే అని జిల్లా న్యాయమూర్తి తమ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో బాధితురాలు కు న్యాయం జరగడానికి కృషి చేసిన దర్యాప్తు అధికారులను జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర అభినందించారు.

## డాక్టర్ బాలుకు రోటరీ ఎక్సలెన్సీ అవార్డు



**కామారెడ్డి ప్రజాజ్యోతి టౌన్ జూన్ 30.** కామారెడ్డి జిల్లా కేంద్రంలో రోటరీ క్లబ్ కామారెడ్డి ఆధ్వర్యంలో 17 సంవత్సరాల నుండి రక్తదానంలో చేస్తున్న సేవలు,తలసేమియా వ్యాధితో బాధపడుతున్న బాధపడుతున్న చిన్నారుల కోసం 3500 యూనిట్ల రక్తాన్ని సేకరించడం,ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తాన్ని అందజేస్తూ, 300 లకు పైగా రక్తదాన శిబిరాలను నిర్వహించడం,వ్యక్తిగతంగా 76 సార్లు రక్తదానం చేసి నేటి సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న డాక్టర్ బాలు ను రోటరీ క్లబ్ ఒకేషనల్ ఎక్సలెన్సీ అవార్డును సోమవారం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ ఈ అవార్డును అందజేసిన అసిస్టెంట్ గవర్నర్ జయపాల్ రెడ్డి,రోటరీ క్లబ్ కామారెడ్డి అధ్యక్షులు రాజనర్సింహారెడ్డి,ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి సబ్బని కృష్ణ హరి,రోటేరియన్ శంకర్,వెంకటరమణ లకు మరియు సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.భవిష్యత్తులో తలసేమియా వ్యాధి చిన్నారుల కోసం మరిన్ని రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి వారి ప్రాణాలను కాపాడడానికి మరింతగా కృషి చేస్తానని అవార్డు గ్రహీత తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నవీన్ శ్రీధర్ లు పాల్గొనడం జరిగింది.



## పద్మశాలి మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్

**బీర్కూర్ జూన్ 30 ఆర్ సి (ప్రజా జ్యోతి)** బీర్కూరు మండల పద్మశాలి అధ్యక్షుడిగా వంగరి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కామారెడ్డి జిల్లా అధ్యక్షులు సీరిగాదా లక్ష్మి నర్సింలు ఆదేశాలతో మండల సమావేశం ఏర్పాటు చేశారు. బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, గంట్యాల బాలకృష్ణ, గూడ శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు రాజు, మండల అధ్యక్షుడు దికొండ రమేష్ ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకోబడింది. ప్రధాన కార్యదర్శిగా అన్నం గంగాధర్, కోశాధికారిగా దికొండ సంతోష్, ఉపాధ్యక్షులుగా గాజుల పండరి, రాము, నాగరాజు, కార్యదర్శిగా సత్యనారాయణ, శ్రీకాంత్, ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ఐకమత్యమే మహాబలం అన్నారు. తామంతా ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు అని తెలిపారు. ప్రతి ఒక్కరు బేషజాలకు పోకుండా కలిసికట్టుగా పరస్పర సహకారంతో ముందుకు వెళితే మరింత అభివృద్ధి సాధించొచ్చు అని తెలిపారు.



## ఆర్అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా మోహన్ బాధ్యతల స్వీకరణ



**కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి జూన్ 30.** కామారెడ్డి జిల్లాలో కొత్తగా నియమితులైన రోడ్లు మరియు భవనాల శాఖ (ఆర్అండ్‌బి) ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పి. మోహన్ బాధ్యతలు సోమవారం స్వీకరించారు. ఈ మేరకు ఆయన, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న కె. రవి శంకర్ నుంచి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా రోడ్ల అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకుంటానని మోహన్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా శాఖ అధికారులు, సిబ్బంది మోహన్‌కు అభినందనలు తెలిపారు.

## బ్లూ కోట్స్ అందజేత



**కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి జూన్ 30.** కామరెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ యందు బ్లూ కోట్స్ సిబ్బందికి కామారెడ్డి పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ నరహరి జాకెట్ లను అందించారు.బ్లూ కోట్స్ సిబ్బంది ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఉద్దేశంతో వారికి పత్రిక గుర్తింపు ఉండాలని బ్లూ కోర్ట్ జాకెట్ లను అందించడం జరిగినది అదేవిధంగా ట్రాఫిక్ లో విధులు నిర్వహిస్తున్నటువంటి సిబ్బందికి కూడా రిఫ్లెక్షన్ జాకెట్లు అందించడం జరిగినది.



# ప్రాణ ప్రదాతలు వైద్యులు

నేడు జాతీయ వైద్యుల దినోత్సవం
జూలై 1, డా.బీ.సి.రాయ్ జయంతి






**రామారెడ్డి జూన్ 30 (ప్రజా జ్యోతి)** 'వైద్యో నారాయణో హరి...' అన్నారు మన పెద్దలు. వైద్యుడు దేవునితో సమానమని అర్థం. నేటి సమాజంలో ప్రజారోగ్యం అనేది నిబద్ధత గల సేవాపరమైన వృత్తి. వ్యక్తి వికాసానికి కావలసినవి మానసిక పరివర్తన, సామాజిక పరివర్తన. ఒక వైద్యుడు నిరంతరం సమాజాధ్యయనంలో కూడా భాగ స్వామ్యుడు. మానసిక ఆరోగ్యం, సామాజిక సమస్యకు గల బంధాన్ని విశ్లేషిస్తూ విశదంగా బోధించే ఒక సామాజిక వైద్య బోధకుడి వల్లనే మానసిక పరివర్తన సాధ్యమవుతుంది. వైద్యుల వల్లనే ఆదర్శవంతమైన ఆరోగ్య సమాజం నిర్మించబడుతుంది. అలాంటి ఆరోగ్య సమాజాన్ని నిర్మించాల్సిన సామాజిక బాధ్యత ఈనాటి వైద్యనిపుణులపై ఉంది. ఇదే కోవలో భారతీయ వైద్యరంగానికి 30 ఏళ్ళు విశేష సేవలందించి నిస్వార్థ జీవితాన్ని గడిపిన డాక్టర్ బీ.సి.రాయ్ దేశం గర్వించదగ్గ గొప్ప వైద్యుడు. పరిపాలనా దక్షునిగా కూడా అనుభవం కలవారు. జూలై 1న 27వ జాతీయ వైద్యుల దినోత్సవం' జరుపుకుంటున్న సందర్భంలో భారతీయ వైద్య వృత్తి రంగానికి విశేష సేవలందించిన బీ.సి. రాయ్ జన్మ దినోత్సమును స్మరించుకునే రోజు కూడా.

## డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ పాట్నా..!


(బీహార్)లోని కుగ్రామంలో 1882, జూలై 1న జన్మించారు. దేశంలో ఆధునిక వైద్యాన్ని గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన మహోన్నత వ్యక్తి. భారతీయ వైద్య సంఘం (ఇండియన్ మెడికల్ అసోషియేషన్) ను 1928లో స్థాపించి తొలి అధ్యక్షుడిగా కొనసాగుతూ వైద్యరంగంలో ఆధునిక పద్ధతుల ద్వారా ' నిరంతర వైద్య విధానం ' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీ.సి.రాయ్ తన 32వ ఏట గాంధీజీ పిలుపుతో స్వాతంత్రోద్యమంలోనూ పాల్గొన్నారు. పద్నాలుగేళ్ళుగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా సేవలందించిన గొప్ప రాజనీతిజ్ఞుడు. ఆయన వైద్యవృత్తిలో, రాజకీయ రంగంలో అందించిన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం బీ.సి. రాయ్ ను 'భారతరత్న' తో సత్కరించి, ఆయన జన్మ దినోత్సవాన్ని 'జాతీయ వైద్యుల దినోత్సవం' గా ప్రకటించింది. వివిధ రంగాలలో నైతిక, సామాజిక బాధ్యత, సేవా స్ఫూర్తితో పనిచేసేవారికి భారత ప్రభుత్వం ఆయన పేరిట "డా. బీ.సి.రాయ్ నేషనల్ అవార్డు'ను 1976, జూలై 1 నుండి బహూకరించడం ప్రారంభించింది. మానవతా మూర్తిగా వెలుగొందిన బీ.సి. రాయ్ 1962, జూలై 1 రోజున మరణించారు.

## వైద్య సేవల్లో అక్కడక్కడ చికిత్సలో సాంకేతిక..!



గుమ్మడి.లక్ష్మీనారాయణ, సామాజిక రచయత

పొరపాట్లు జరిగినప్పుడు డాక్టర్లను బాధ్యులను చేయడం పరిపాటి. ఈ విషయంలో పౌరసమాజంలో దీన్ని విజ్ఞతతో ఆలోచించాల్సిన సున్నితాంశం. 2017, జూన్ 11న కలకత్తాలో ముఖర్జీ అనే వైద్యునిపై జరిగిన దాడిని భారతీయ వైద్య సమాజం ఖండించిన విషాదాంతాలు మళ్ళీ పునరావృతం కాకూడదు. ప్రపంచం మొత్తం కరోనాను ఎదురీదుతున్న క్లిష్ట పరిస్థితుల్లోనూ డాక్టర్లు తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ, ధైర్యంతో కరోనా బాధితులకు చికిత్స చేయడం గర్వించదగ్గ విషయం. దేశ సరిహద్దుల్లో కాపలా కాస్తున్న జవానుల సేవలు, మరోప్రక్క కరోనా వంటి వ్యాధులతో పోరాడుతున్న రోగులకు అత్యవసర సేవలందిస్తున్న వైద్యుల సేవలూ అమోఘమైనవి. బ్రిటన్ ప్రధాని రోగులను పరామర్శించడానికి ఆసుపత్రికి వెళ్ళి, జాగ్రత్తలేవీ పాటించకుండా తిరిగి, కరోనా బారిన పడ్డారు. సరైన చికిత్స తీసుకొని కరోనా గండం నుండి బయట పడ్డారు. ఆసుపత్రి నుంచి బయటి రాగానే ఆయన నోటి నుండి వచ్చిన మాటలు – " వైద్యులే నా ప్రాణ రక్షకులు" అని!. ఇంకా చాలా మంది రాజకీయనాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వాధికారులు కూడా




ముందు జాగ్రత్తలు పాటించకుంటే కరోనా బారిన పడ్డ సంఘటనలు చూసాం. నిబద్ధతతో కూడిన వైద్యుల సేవలు ఉన్నంతకాలం మనం రక్షణ వలయంలోనే ఉంటామని వైద్యులను విశ్వసిద్దాం.



# బాన్సువాడ నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా సుధాకర్ గౌడ్

బాన్సువాడ టౌన్ ప్రజా జ్యోతి జూన్ 30. బాన్సువాడ ప్రెస్ క్లబ్ ఎన్నికలు ఆదివారం సాయంత్రం నిర్వహించారు.69 మంది సభ్యులు ఓటింగ్ లో పాల్గొన్నారు.అధ్యక్షుడి బరిలో సుధాకర్ గౌడ్ మామిళ్ల రాజు నిలిచారు. కాగా.. సుధాకర్ గౌడ్కు 40 ఓట్లు, మామిళ్ల రాజు 28 ఓట్లు దక్కాయి.ఒక ఓటు నోటాకు పడింది. దీంతో సుధాకర్ గౌడ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి పదవికి ఇద్దరు పోటీలో ఉండగా గంట చంద్రశేఖర్కు 40 ఓట్లు,యూనుస్కు 28 ఓట్లు పోలయ్యాయి.ఉపాధ్యక్షులుగా ప్రమోద్ రెడ్డి, శ్యాంసుందర్,కోశాధికారిగా రుద్రంగి అశోక్,జాయింట్ సెక్రెటరీలుగా ఇలియాస్,సలీం, కార్యవర్గ సభ్యులుగా అరుణ్ రెడ్డి, జాకీర్, నజీర్,సుధీర్ కుమార్,మహేష్ కుమార్ ఎన్నికయ్యారు.